సాక్షి నిర్మల్

గురువారం । 6 । జూన్ । 2024



పోస్టల్ బ్యాలెట్‌లోనూ బీజేపీ..
ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్‌లోనూ బీజేపీ ఆధిక్యత చాటుకుంది. 9,232 ఓట్లు సాధించిన పార్టీ అభ్యర్థి బాపూరావు అగ్రస్థానంలో నిలిచారు. 8లో▸



ఘనంగా పర్యావరణ దినోత్సవం
ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీలు నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
37.0 /27.0

వాతావరణం
ఆకాశం మేఘావృతమవుతుంది. వాతావరణం చల్లబడుతుంది. పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

అడవులను రక్షించుకుంటేనే మానవ మనుగడ



మొక్క నాటుతున్న సీసీఎఫ్ శరవణన్

సారంగాపూర్: అడవులను రక్షించుకుంటేనే మానవాళి మనుగడ సాధ్యమని బాసర సర్కిల్ సీసీఎఫ్ కే శరవణన్ పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం మండలంలోని గండిరామన్న హరితవనంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. అడవుల్లోని చెట్లు నరకవద్దని, దట్టమైన అడవుల కారణంగానే సమయానుకూలంగా వర్షాలు కురుస్తాయని తెలిపారు. విద్యార్థులకు మొక్కలు పెంపకం, ప్రయోజనాల గురించి వివరించాలని సూచించారు. అనంతరం అడెల్లి మహాపోచమ్మ నందనవనంలో ఆయన మొక్కలు నాటారు. ఆయన వెంట నిర్మల్ ఇన్‌చార్జి ఎఫ్‌ఆర్వో, ఐఎఫ్ఎస్ (శిక్షణ) కేపీవీఎస్ ప్రసాద్, డీఆర్వో సంతోష్, పార్క్ ఎఫ్ఎస్వో వేణుగోపాల్, డీఆర్వో శ్రీదేవి, ఎఫ్‌బీవోలు వెన్నెల, రాజసింధు, స్వప్న, సిబ్బంది ఉన్నారు.

స్కూల్ బస్సుల సామర్థ్యాన్ని పరీక్షించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న వెంకటేశ్

నిర్మల్‌టౌన్: జిల్లాలో స్కూల్ బస్సుల సామర్థ్యాన్ని పరీక్షించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ఆర్టీవో కార్యాలయంలో బుధవారం సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యాసంస్థలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులను తరలించే బస్సులను తనిఖీ చేయాలని సూచించారు. ఫిట్‌నెస్ లేకుండా బస్సులను నడిపితే వెంటనే సీజ్ చేసి యజమానులపై కేసు నమోదు చేయాలని కోరారు.


తూకంలో మోసాలకు పాల్పడితే కఠినచర్యలు



కాంటా పరిశీలిస్తున్న విజయసారథి

లోకేశ్వరం: తూకంలో మోసం చేస్తే కఠినచర్యలు తప్పవని కరీంనగర్ జోన్ తూనికలు, కొలతల శాఖ లీగల్ మెట్రాలజీ విజయసారథి హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని సూపర్‌మార్కెట్, స్వీట్ షాప్, పెట్రోల్ బంక్‌ల్లో తూకం, కొలతలను పరిశీలించారు. లోకేశ్వరంలో తూనికలు, కొలతల శాఖపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్‌లో నిత్యావసరాలపై ఉన్న ప్రింటెడ్ ధర కంటే అదనంగా వసూలు చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతీ ఏడాది తూనికలు, కొలతల శాఖ అధికారులతో స్టాంపింగ్ చేయించుకుని అనుమతులు పొందాలని సూచించారు. సిమెంట్, ఫర్టిలైజర్ షాపుల్లో తూకం మిషన్లు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ఆయన వెంట లైసెన్స్ హోల్డర్ అయాజ్ అహ్మద్‌ఖాన్, షాపుల యజమానులు శ్రీనివాస్, సంతోష్, రాజు, బిట్టు తదితరులున్నారు.

విత్తనాల కొరత రానివ్వొద్దు



రికార్డులు పరిశీలిస్తున్న అంజిప్రసాద్

భైంసాటౌన్: రైతులకు సరిపడా విత్తనాలు అందుబాటులో ఉంచాలని జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్ సూచించారు. బుధవారం పట్టణంలోని గాంధీగంజ్‌లో పలు విత్తన దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణాల్లో విత్తనాలు, ఫర్టిలైజర్, ఎరువుల స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. విత్తనాలు కొనుగోలు సమయంలో రైతులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని వ్యాపారులకు సూచించారు. అధిక ధరలకు విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కమలం.. స్థిరత్వం



జిల్లాకేంద్రంలో బీజేపీ విజయోత్సవ ర్యాలీ (ఫైల్)

- మొన్న అసెంబ్లీ ఎన్నికల్లో..
- తాజాగా లోక్‌సభ పోరులో..
- ఆధిక్యత కొనసాగించిన బీజేపీ
- గత ఎన్నికల్లోనూ భారీగా ఓట్లు
- 'స్థానిక సంస్థల'పైనా ప్రభావం

నిర్మల్: బీజేపీది ఒకప్పుడు కనీసం పోటీ చేయడానికి కూడా అభ్యర్థులు దొరకని పరిస్థితి. ఎన్నికల్లో పోటీచేసినా పోలింగ్ ఏజెంట్లు లేని దుస్థితి. అన్నీ ఉండి బరిలో నిలిచినా.. డిపాజిట్లు దక్కని సందర్భాలెన్నో. ఎప్పుడో ఒకసారి.. ఎక్కడో ఒకట్రెండు చోట్ల మెరుపులా గెలిచి.. మళ్లీ కనపడకుండా పోయేది. అలాంటి పార్టీ పరిస్థితి ఇప్పుడు మొత్తం మారిపోయింది. పదేళ్లనుంచి పరిస్థితులను తనకు అనుకూలంగా మలుచుకుంటూ.. గెలుపోటములను తట్టుకుని నిలబడుతూ.. ఇప్పుడు తనకంటూ భారీ ఓటుబ్యాంక్‌ను సుస్థిరం చేసుకుంది. జిల్లాలో గత లోక్‌సభ, మొన్నటి అసెంబ్లీ.. తాజాగా ఎంపీ ఎన్నికల్లో వరుసగా ఆధిక్యత కనబర్చింది. ఈ ప్రభావం రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపైనా ఉంటుందని కమలదళం భావిస్తోంది.

2019 నుంచే..

జిల్లాలో గతంలో నిర్మల్ మున్సిపల్ చైర్‌పర్సన్ స్థానాన్ని కైవసం చేసుకున్న చరిత్ర బీజేపీకి ఉంది. ఆ తర్వాత మళ్లీ ఆ స్థాయిలో ఎక్కడా.. ఎప్పుడూ విజయాన్ని దక్కించుకోలేకపోయింది. పార్టీకి కట్టుబడి ఉండే కార్యకర్తలు, అభిమానులు ఉన్నప్పటికీ కనీస ఓట్లనూ పొందలేదు. ఎప్పుడైతే కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం కొలువుదీరిందో అప్పటి నుంచి జిల్లాలోనూ బీజేపీ పట్టుపెంచుకునే ప్రయత్నం మొదలుపెట్టింది. 2014లో అంతగా ప్రభావం చూపకున్నా.. 2019 లోక్‌సభ ఎన్నికలకు వచ్చేసరికి పార్టీ క్రేజ్ ఒక్కసారిగా పెరిగిపోయింది. అంతకు కొన్నినెలల క్రితమే 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మూడు నియోజకవర్గాల్లో ఓటమిని మూటగట్టుకున్న పార్టీ.. 2019 లోక్‌సభ పోరులో దాదాపు 40వేల మెజార్టీనిచ్చి ఆదిలాబాద్ ఎంపీగా సోయం బాపూరావు గెలుపులో జిల్లా కీలకంగా నిలిచింది.

ఒకేసారి ఇద్దరు ఎమ్మెల్యేలు..

2023 అసెంబ్లీ ఎన్నికలకు వచ్చేసరికి బీజేపీ వేగంగా పుంజుకుంది. ఆ పార్టీ టికెట్ కోసం పోటాపోటీ ఏర్పడింది. ఇలాంటి పరిస్థితుల్లో నిర్మల్, ముధోల్ స్థానాలను కమలం కైవసం చేసుకుని కొత్త చరిత్ర సృష్టించింది. నిర్మల్‌లో బీజేపీ అభ్యర్థిగా పోటీచేసిన మహేశ్వర్‌రెడ్డి అప్పుడు మంత్రిగా ఉన్న ఇంద్రకరణ్‌రెడ్డిపై ఏకంగా 50,703ఓట్ల మెజార్టీతో గెలవడం విశేషం. ముధోల్‌లో బీజేపీ అభ్యర్థిగా పోటీచేసిన రామారావుపటేల్ కూడా 23,583 ఓట్ల తేడాతో అప్పటి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న విఠల్‌రెడ్డిపై గెలుపొందారు. అలా.. 2023 ఎన్నికలు జిల్లా కమలానికి కొత్తదారి చూపాయి. ఏలేటిని ఏకంగా బీజేఎల్పీ లీడర్‌ను చేశాయి.

ముమ్మందూ ప్రభావం..

వరుస ఎన్నికల్లో ఓట్లు పెంచుకుంటూ వస్తున్న బీజేపీ జిల్లాలో సుస్థిరమైన ఓటుబ్యాంక్‌ను తయారు చేసుకుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ తీరు ఇలాగే సాగితే.. ముమ్మందు సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లోనూ కమలం జోరు కొనసాగే అవకాశాలు ఉంటాయని చెబుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇద్దరు ఎమ్మెల్యేలు, తాజా ఎంపీ గెలుపులో కీలకంగా మారిన జిల్లాపై పార్టీ అధిష్టానం దృష్టిపెడుతోందని కమలం శ్రేణులు పేర్కొంటున్నాయి. జిల్లా అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి సహకారం అందుతుందని ఆశిస్తున్నాయి.

మళ్లీ అదే జోరు..

మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపు గాలివాటమేనని, బీఆర్ఎస్‌పై వ్యతిరేకత, అభ్యర్థుల కారణంగానే రెండుస్థానాల్లో గెలిచిందని చాలామంది కామెంట్లు చేశారు. కానీ.. తాజాగా పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్‌కు అదే భారీ ఆధిక్యతను జిల్లా అందించడం గమనార్హం. ప్రతీరౌండ్‌లో బీజేపీ భారీగా మెజార్టీ పెరుగుతూ వచ్చింది. చివరకు నిర్మల్‌లో 43,850, ముధోల్‌లో 37,833, ఖానాపూర్‌లో 13,519 ఓట్లు కలిపి మొత్తం మీద జిల్లాలో 95,202ఓట్ల మెజార్టీని బీజేపీ దక్కించుకుంది.

నీట్‌లో నిర్మల్ విద్యార్థుల సత్తా



తల్లిదండ్రులు, సోదరుడితో సగ్గం అఖిల్‌సాయి

నిర్మల్‌ఖిల్లా: ఇటీవల విడుదలైన నీట్ (యూజీ)-2024 ప్రవేశ పరీక్ష ఫలితాల్లో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు సత్తా చాటారు. మంచిర్యాంకులు సాధించి వైద్యవిద్య అభ్యసించడానికి మార్గం సుగమం చేసుకున్నారు.

ఆటో డ్రైవర్ కొడుకుకు జాతీయ ర్యాంక్



సగ్గం అఖిల్‌సాయి

జిల్లా కేంద్రంలోని వెంకటాపూర్ కాలనీకి చెందిన సగ్గం ముత్యం-లక్ష్మి దంపతుల చిన్న కుమారుడు అఖిల్‌సాయి నీట్ ప్రవేశ పరీక్షలో జాతీయస్థాయిలో 720 మార్కులకు గాను 691 సాధించి సత్తా చాటాడు. జాతీయ స్థాయిలో 4,051, ఓబీసీ కేటగిరీలో 1,536 ర్యాంక్ సాధించాడు. అఖిల్‌సాయి ఐదో తరగతివరకు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో, ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు స్థానిక జుమ్మెరాత్‌పేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, 9, 10 తరగతులను జిల్లా కేంద్రంలోని విన్నర్స్ ఒలింపియాడ్ స్కూల్‌లో చదివాడు. హైదరాబాద్‌లోని నారాయణ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసి ఇటీవల విడుదలైన నీట్ పరీక్షా ఫలితాల్లో ఎంబీబీఎస్‌లో సీటు సాధించాడు. లఖిల్‌సాయి తండ్రి ముత్యం దివ్యాంగుడైనప్పటికీ జిల్లా కేంద్రంలో ఆటో నడుపుతుండగా, తల్లి లక్ష్మి బీడీలు చుడుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. కాగా, జాతీయ స్థాయి ర్యాంక్ సాధించిన అఖిల్‌సాయిని పలువురు అభినందించారు.

మెరిసిన 'అభ్యుదయ్'



దర్శనం అభ్యుదయ్

జిల్లా కేంద్రానికి చెందిన ఉపాధ్యాయ దంపతులు దర్శనం సుప్రియ-దేవేందర్ కుమారుడు అభ్యుదయ్ నీట్ పరీక్షా ఫలితాల్లో 653 మార్కులతో ఆల్ ఇండియా స్థాయిలో 26,805, ఓబీసీ విభాగంలో 12,049 ర్యాంక్ సాధించాడు. అభ్యుదయ్ ఎంబీబీఎస్‌లో ప్రవేశం పొందనుండగా పలువురు అతడిని అభినందించారు.

దీక్షతో చదివి..



నాగుల దీక్షిత

జిల్లా కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు నాగుల రవిగౌడ్-లత దంపతుల కుమార్తె దీక్షిత నీట్‌లో 720 మార్కులకు 677 సాధించి జాతీయస్థాయిలో 9,975, ఓబీసీ కేటగిరీలో 4,097 ర్యాంక్ సాధించింది. దీక్షిత చిన్నప్పటినుంచే డాక్టర్ కావాలనే లక్ష్యంతో పట్టుదలతో చదివింది. నీట్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చడంతో పలువురు దీక్షితను అభినందించారు.

ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

- ఎస్పీ జానకీషర్మిల



మాట్లాడుతున్న ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్‌టౌన్: ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని, ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని ఎస్పీ జానకీషర్మిల సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన పోలీస్ కార్యాలయంలో బుధవారం పోలీస్ అధికారులతో ఆన్‌లైన్‌లో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. దర్యాప్తులో ఉన్న కేసులపై సమగ్ర విచారణ చేపట్టి నేరస్తులకు శిక్ష పడేలా చూడాలని సూచించారు. గోవుల అక్రమ రవాణాను అరికట్టాలని, నకిలీ విత్తనాలపై ఉక్కు పాదం మోపాలని ఆదేశించారు. ఈ నెల 17న బక్రీద్ పండుగ సందర్భంగా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు సూచించారు. భైంసా, నిర్మల్ పరిధిలో 10 తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని ఠాణాల వారీగా పెండింగ్ కేసుల వివరాలు తెలుసుకున్నారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ, గ్రేవ్ కేసుల్లో త్వరగా ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలని తెలిపారు. సమర్థవంతంగా విధులు నిర్వహించి పోలీస్‌శాఖ ప్రతిష్టను పెంచాలన్నారు. తనకు ఫిర్యాదు చేయాలనుకునేవారు 8712659599 వాట్సాప్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. సమావేశంలో భైంసా ఏఎస్పీ కాంతిలాల్, నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ చర్యలు చేపట్టాలి



కూలీలతో మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాస్

సారంగాపూర్: మొక్కలు నాటడంతో పాటు సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డీపీవో శ్రీనివాస్ సూచించారు. మండలంలోని జామ్ గ్రామాన్ని బుధవారం ఆయన సందర్శించారు. పల్లె ప్రకృతివనం, బృహత్ పల్లె ప్రకృతివనం, నర్సరీ, డంప్‌యార్డు, వైకుంఠధామాన్ని పరిశీలించారు. పల్లె ప్రకృతివనాల్లో మొక్కలు నాటుతున్న ఉపాధిహామీ కూలీలతో మాట్లాడారు. ఇంటి ఆవరణల్లోని ఖాళీ స్థలాల్లో నీడనిచ్చే, పండ్ల మొక్కలు పెంచాలని సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా డీపీవో పల్లె ప్రకృతివనంలో కూలీలతో కలిసి మొక్కలు నాటారు. గ్రామపంచాయతీ ట్రాక్టర్ ట్యాంకర్ సాయంతో మొక్కలకు నీరందించే ఏర్పాట్లు చేయాలని పంచాయతీ కార్యదర్శి అశోక్, కారోబార్ సురేశ్‌కు సూచించారు. ఆయనవెంట ఎఫ్ఏ నాగయ్య, నారాయణ తదితరులున్నారు.

రికార్డులు పూర్తి చేయాలి

లోకేశ్వరం: పంచాయతీ రికార్డులను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని డీపీవో శ్రీనివాస్ సూచించారు. బుధవారం మండలంలోని ధర్మోర గ్రామంలో సెగ్రిగేషన్ షెడ్, శ్మశానవాటిక, నర్సరీని సందర్శించారు. పంచాయతీ రికార్డులు పరిశీలించి మాట్లాడారు. పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టాలని, ఇంటిపన్నులు వందశాతం వసూలు చేయాలన్నారు. డీఎల్పీవో మోజం, ఎంపీడీవో సోలమాన్ రాజ్, పంచాయతీకార్యదర్శి శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.

కుభీర్‌లో..

కుభీర్: కుభీర్‌లోని పంచాయతీ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులతో డీపీవో శ్రీనివాస్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. తడి, పొడి చెత్త వేరుచేసి సేంద్రియ ఎరువు తయారు చేయాలని సూచించారు. ఎంపీవో గోవర్ధన్, ఈవో విజయ్, కారోబార్లు బాబు, ప్రకాశ్ ఉన్నారు.

భారతీయ సంస్కృతి గొప్పది



చిన్నారులకు సర్టిఫికెట్లు ఇస్తున్న ఎమ్మెల్యే

భైంసాటౌన్: భారతీయ సంస్కృతి చాలా గొప్పదని, దీనిని భావితరాలకు అందించాలని ఎమ్మెల్యే పీ రామారావుపటేల్ సూచించారు. బుధవారం పట్టణంలోని నర్సింహా కల్యాణమండపంలో ఓ శ్రీ కళానిలయం ఆధ్వర్యంలో వార్షికోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. కళానిలయం నిర్వాహకుడు గిరి యోగేశ్ చిన్నారులకు భారతీయ నృత్యం నేర్పించడం అభినందనీయమన్నారు. అంతకుముందు చిన్నారులు నృత్య ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సిరం రవీందర్‌రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో దేగాంలో నెలరోజుల నృత్య శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు ఇచ్చారు. ఎంఈవో సుభాష్, బీజేపీ నాయకులు సుష్మారెడ్డి, వెంగల్‌రావు, నృత్య శిక్షకుడు వేణుగోపాల్‌శాస్త్రి ఉన్నారు.

గ్రూప్–1 పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి

నిర్మల్ రూరల్: ఈ నెల 9న జిల్లా కేంద్రంలో గ్రూప్–1 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రూప్–1 పరీక్ష నిర్వహణపై పరిశీలకులు, సీఎస్‌లు, రూట్ అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామని, అభ్యర్థులంతా హాల్‌టికెట్లపై పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో అతికించాలని, ప్రభుత్వం జారీ చేసిన ఏదైన గుర్తింపుకార్డు వెంట తెచ్చుకోవాలని సూచించారు. ఉదయం 10గంటల్లోపు కేంద్రాలకు చేరుకోవాలని, నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదని చెప్పారు. పరీక్షాపత్రాలు, సామగ్రి తరలింపు సమయంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రాంతీయ సమన్వయకర్త గంగారెడ్డి, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపిక జాబితా ప్రదర్శన

కుంటాల: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాల ఎంపిక జాబితాను బుధవారం వెల్లడించినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 10నుంచి 15వ తేదీ వరకు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో వచ్చి అడ్మిషన్ పొందాలని సూచించారు.

ఈవీఎం గోదాముల పరిశీలన

నిర్మల్ రూరల్: కలెక్టరేట్ సమీపంలోని ఈవీఎం గోదాంలను బుధవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ పరిశీలించారు. పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు పూర్తయినందున ఈవీఎంలను గోదాంలో భద్రపరిచి సీల్ వేశారు. ముధోల్ ఆర్డీవో కోమల్‌రెడ్డి, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు శ్రీనివాస్, రాజకీయ పార్టీల ప్రతినిధులు కొరిపెల్లి శ్రావణ్‌రెడ్డి, సయ్యద్ అజర్, గంగ్రత్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇక పాఠశాలబాట..!

- నేటి నుంచి జిల్లాలో బడిబాట
- విద్యార్థుల నమోదుకు చర్యలు



ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యత తెలిపేలా కరపత్రాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు (ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: నూతన విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచేందుకు ఈ నెల 6నుంచి 19వ తేదీ వరకు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఉదయం 7నుంచి 11గంటల వరకు కార్యక్రమం నిర్వహించాలని మార్గదర్శకాలు విడుదల చేసింది. కార్యక్రమాన్ని జిల్లా, మండల స్థాయిలో డీఈవో, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు, స్వయం సహాయక బృందాలు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, యువజన సంఘాలు, గ్రామస్థాయి కమ్యూనిటీల సమన్వయంతో విజయవంతం చేసేందుకు విద్యాశాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు.

కార్యక్రమం అమలు ఇలా..

బడిబాటలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఐదేళ్లు పూర్తయిన చిన్నారులతోపాటు బడిబయటి పిల్లలు, బాల కార్మికులు, అనాథలకు ప్రవేశాలు కల్పించాలి. గ్రామ విద్యా నమోదు ప్రవేశ రిజిస్టర్‌ను అప్‌డేట్ చేయాలి. ఇతర ఆన్‌లైన్ సేవలు నవీకరించాలి. విద్యార్థుల నమోదు తక్కువున్న పాఠశాలలను గుర్తించి తల్లిదండ్రులు, సమాజం భాగస్వామ్యంతో సంఖ్య పెంచడానికి ప్రణాళికలు రూపొందించాలి. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల సాయంతో బడిబయటి పిల్లలను గుర్తించి, వారి వయస్సు ప్రకారం తగిన తరగతుల్లో చేర్పించాలి. పాఠశాలల్లో ద్విభాష పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్స్, మధ్యాహ్న భోజనం ప్రత్యేకావసరాలు గల పిల్లలకు అలవెన్స్, స్టైఫండ్, బాలికావిద్య ప్రాధాన్యత, ప్రోత్సాహకాలపై అవగాహన కల్పించాలి. డిజిటల్ క్లాస్ రూమ్స్, ప్యానెల్ బోర్డ్స్, ట్యాబ్స్, డెస్కటాప్స్, ఈ లెర్నింగ్ ఎడ్యుకేషనల్ యాప్స్, ఫేషియల్ రికగ్నేషన్ సిస్టం, లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టం లాంటి ఆధునాతన సౌకర్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి. విద్యార్థులు ఇంట్లో నేర్చుకోవడానికి అందుబాటులో ఉన్న వివిధ వనరులపై అవగాహన కల్పించాల్సి ఉంటుంది. జిల్లాస్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మున్సిపల్, కార్మిక ఆరోగ్యశాఖ సంక్షేమశాఖలు, మహిళా సమాఖ్య భాగస్వామ్యం ద్వారా తగిన కార్యాచరణ రూపొందించుకుని అందరి సమన్వయంతో బడిబాటలో భాగస్వాములు కావాల్సి ఉంటుంది.



విద్యాశాఖ రూపొందించిన కరపత్రం (ఫైల్)

చేపట్టాల్సిన కార్యక్రమాలు

అంగన్‌వాడీ పాఠశాలల్లో పిల్లలను నమోదు చేయించాలి. బడిబయటి పిల్లలు, బాలకార్మికులను గుర్తించాలి. ఆన్‌లైన్ ప్రమోషన్, పాఠశాల సంసిద్ధత కార్యక్రమాలు నిర్వహించాలి. పిల్లల తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులను సంప్రదాయబద్ధంగా ఆహ్వానించాలి. సంక్షేమ వసతి గృహాల వినియోగంపై వారికి అవగాహన కల్పించాలి.


రోజువారీ కార్యక్రమాలు ఇలా..

6వ తేదీన గ్రామస్థాయిలో సమావేశం నిర్వహించి బడిబాట నమోదు డ్రైవ్‌పై చర్చించాలి. పిల్లలను నమోదు చేయడానికి ప్రతిజ్ఞ చేయాలి. బడిబాట అవగాహన ర్యాలీ నిర్వహించాలి. 7న గ్రామంలోని బడీడు పిల్లల ఇంటికి వెళ్లి వారిని పాఠశాలల్లో నమోదు చేయాలి. 8నుంచి 10వ తేదీ వరకు పాఠశాలల్లో నమోదు చేసే వయస్సు కలిగిన పిల్లల కోసం ఇంటింటి ప్రచారం చేపట్టాలి. అంగన్‌వాడీ కేంద్రాలు సందర్శించి బడీడు పిల్లల్ని పాఠశాలల్లో నమోదు చేసుకోవాలి. దివ్యాంగ విద్యార్థులను భవిత కేంద్రాల్లో చేర్పించేలా ప్రోత్సహించాలి. 11న బడిబాట ప్రగతిపై గ్రామసభ నిర్వహించాలి. 12న పాఠశాలల్లో నమోదు కాని పిల్లలను గుర్తించి ప్రవేశాలు కల్పించాలి. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పథకంలో భాగంగా విద్యార్థులకు అందిస్తున్న వసతులపై ప్రచారం చేయాలి. పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్స్, నోట్‌బుక్స్ యూనిఫాంలు పంపిణీ చేయాలి. 13న పఠనం, అంకగణితం, లర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాండే నిర్వహించాలి. 14న ప్రాథమిక తరగతుల్లో ప్రవేశాల కోసం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించాలి. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలి. పాఠశాలల స్థాయి పిల్లల కమిటీలు, క్లబ్బులు ఏర్పాటు చేయాలి. 15న బాలిక విద్యాదినం నిర్వహించాలి. ప్రత్యేకావసరాలు గల పిల్లలను గుర్తించి వారిని భవిత కేంద్రాలు లేదా పాఠశాలల్లో నమోదు చేయించాలి. 18న తరగతుల డిజిటలైజేషన్, మొక్కలు నాటడంలాంటి కార్యక్రమాలు చేపట్టాలి. డిజిటల్ తరగతుల గురించి అవగాహన కల్పించాలి. 19వ తేదీన క్రీడా దినోత్సవం, తరగతుల వారీగా ఆటలపోటీలు నిర్వహించాలి.

నేటి నుంచి బడిబాట

నిర్మల్ రూరల్: జిల్లాలో గురువారం నుంచి ఈ నెల 19వరకు బడిబాట నిర్వహించనున్నట్లు డీఈవో రవీందర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, జిల్లా, మండల స్థాయి అధికారులు భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. విద్యాశాఖ నిర్దేశించిన షెడ్యూల్‌ను పాటించాలని సూచించారు. హెచ్ఎంలు, ఉపాధ్యాయులు సమన్వయంతో కార్యక్రమాన్ని సక్సెస్ చేయాలని కోరారు.

ప్రణాళికలు సిద్ధం చేశాం



పాఠశాల విద్యాశాఖ నిర్దేశించిన ప్రకారం జిల్లాలో 735 పాఠశాలల్లో బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. ఇప్పటికే ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులకు విధివిధానాలు వివరించాం. ఉన్నత విద్యార్హతలు కలిగిన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలల ప్రత్యేకత తెలిపేలా డిజిటల్ కరపత్రాలు రూపొందించాం. అందరి సమన్వయంతో సాధ్యమైనంత ఎక్కువమంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడమే లక్ష్యంగా ముందుకుసాగుతున్నాం.

– డాక్టర్ రవీందర్‌రెడ్డి, డీఈవో

క్లుప్తంగా

'లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి'


మాట్లాడుతున్న కొడప నగేశ్

ఇచ్చోడ: చట్టబద్ధత లేని లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించేంత వరకు ఉద్యమం కొనసాగుతుందని తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి కొడప నగేశ్ అన్నారు. కేసు విచారణలో భాగంగా కోర్టుకు హాజరైన ఆయన మాట్లాడారు. ఎన్ని కేసులు పెట్టినా ఆదివాసీ ఉద్యమం కొనసాగుతుందన్నారు. ఆయన వెంట తుడుందెబ్బ రాష్ట్ర కార్యనిర్వహణ అధ్యక్షుడు గోడం గణేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు రామెల్లి భోజన్న , ఐటీడీఏ డైరెక్టర్ మెస్రం భూమన్న, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కుడల స్వామి ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి


ప్రవీణ్ యాదవ్ (ఫైల్)

తాంసి: మండలంలోని జామిడి గ్రామానికి చెందిన ప్రవీణ్ యాదవ్ (34) చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. నాలుగు రోజుల క్రితం అనారోగ్యానికి గురికావడంతో రిమ్స్‌కు తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతునికి భార్య మౌనిక, కూతురు ఉన్నారు.

రిమ్స్‌కు పొల్యూషన్ రహిత అవార్డు



అవార్డు అందుకుంటున్న జైసింగ్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి ఉత్తమ కాలుష్య రహిత అవార్డు దక్కింది. బుధవారం హైదరాబాద్‌లో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు ప్రిన్సిపల్ సెక్రెటరీ వాణిప్రసాద్ చేతుల మీదుగా డీఎంఈ వాణితో కలిసి ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య


దుయిపోడే పండిత్(ఫైల్)

ఇంద్రవెల్లి: పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఏమాయికుంట జీపీ పరిధిలోని రమాయినగర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై దుబ్బక సునీల్ తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన దుయిపోడే పండిత్ (44) కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. నెల రోజులుగా మద్యానికి బానిసై వచ్చిన డబ్బులు తాగుడుకు ఖర్చు చేసేవాడు. ఈ నెల 1న ఇంట్లో ఉన్న జొన్నలు కూడా అమ్ముకోవడంతో అతని భార్య రుక్మాబాయి ఎందుకు అమ్మావని ప్రశ్నించడంతో గొడవ జరిగి బయటకు వెళ్లిపోయాడు. మద్యం మత్తులో పురుగుల మందుతాగి ఇంటికి వచ్చాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108లో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆదర్శం.. మల్యాల్ ఆదివాసీ గూడెం

- తొమ్మిదేళ్ల క్రితం 30 కుటుంబాలు సంఘంగా ఏర్పాటు
- ప్రతీ నెల ఇంటికి వందరూపాయలు జమ
- ప్రస్తుతం రూ.18 లక్షలతో కొనసాగుతున్న సంఘం
- వడ్డీ లేకుండా విత్తనాలు, ఎరువులు సరఫరా


ఇంటింటికీ ఎరువు బస్తాలు పంపిణీ చేస్తున్న సభ్యులు (ఫైల్)

ఇచ్చోడ: మండలంలోని మల్యాల్ గ్రామ పంచాయతీ పరిధిలో స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్న 30 ఆదివాసీ కుటుంబాలు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. ఆయా కుటుంబాల్లో దాదాపు 200ల మంది జనాభా ఉన్నారు. ఏటా గూడెంలో జరిగే వివాహాలు, వ్యవసాయంతో పాటు ఇతర అవసరాలకు ప్రైవేట్ వ్యాపారుల నుంచి అధికవడ్డీకి అప్పు తెచ్చుకునేవారు. ప్రకృతి వైపరీత్యాలతో పంటలు పండకపోవడంతో చేసిన అప్పులు తీర్చలేక నానాఅవస్థలు పడేవారు. వీటన్నింటి పరిష్కారంకోసం గూడెం పెద్దలు ఒక నిర్ణయానికి వచ్చి సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు.

తొమ్మిదేళ్ల క్రితం సంఘంగా ఏర్పాటు

గూడెంలో నివాసం ఉంటున్న 30 కుటుంబాలు సంఘంగా ఏర్పడ్డారు. ప్రతీ కుటుంబం నుంచి నెలకు రూ.100 వసూలు చేసి సభ్యుల వద్ద జమచేశారు. అత్యవసరం అయిన వారికి రూ.3 చొప్పున వడ్డీకి ఇవ్వడం ప్రారంభించారు. తీసుకున్న వారు ఏటా సంక్రాంతి నాటికి వడ్డీతో సహా చెల్లించాలని నిబంధన పెట్టుకున్నారు.

అత్యవసరంతో ప్రారంభమై...

అత్యవసర సమయంలో వడ్డీకి డబ్బులు తీసుకోవడంతో ప్రారంభమైన సంఘం నేడు వివాహాలు, పంటల సాగుకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కొనుగోలుకు ఏటా వర్షాకాలం సీజన్‌కు ముందు ఒక్కో కుటుంబానికి రూ.50 వేల చొప్పున ఇచ్చే స్థాయికి చేరింది. ప్రస్తుతం సంఘంలో రూ.18 లక్షలు జమయ్యాయి. ఈ ఏడాది రూ.4 లక్షల విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి అవసరం ఉన్న వారికి అందజేశారు. ప్రతీ కుటుంబానికి వ్యవసాయ పనులకోసం రూ.50 వేల నగదు కూడా అందజేశారు. వ్యవసాయం కోసం తీసుకున్న విత్తనాలు, ఎరువులకు వడ్డీ తీసుకోకపోవడం ఈ సంఘానికి ఉన్న మరో ప్రత్యేకత.

నిర్ణయానికి కట్టుబడి..



గూడెం పెద్దలు తీసుకున్న నిర్ణయానికి సభ్యులంతా కట్టుబడి ఉంటారు. తొమ్మిదేళ్ల క్రితం సంఘం ఏర్పాటుకు ముందు గూడెమంతా వ్యవసాయం చేయడానికి డబ్బులు లేక ఇబ్బందులకు పడేవారు. దీంతో సంఘం ఏర్పాటు చేసుకున్నాం.
– మెస్రం రామారావు, గూడెం పటేల్

అభివృద్ధివైపు అడుగులు



సంఘం ఏర్పాటు తర్వాత గూడెం అభివృద్ధిలోకి వచ్చింది. గతంలో ప్రైవేట్ వ్యాపారుల వద్ద తీసుకున్న అప్పులు తడిసి మోపెడు కావడంతో తీర్చే మార్గం కోసం వెతికేవాళ్లం. ప్రస్తుతం విత్తనాలు, ఎరువుల కోసం తీసుకున్న అప్పుకు వడ్డీ లేకపోవడంతో అదనపు భారం పడడంలేదు. దీంతో గూడెం అభివృద్ధి వైపు అడుగులు వేస్తోంది.
– మెస్రం దేవురావు, సంఘం ప్రధాన కార్యదర్శి

విద్యుత్‌షాక్‌తో విద్యార్థికి గాయాలు


చికిత్స పొందుతున్న భుజంగరావు

నార్నూర్: మండలంలోని ఖంపూర్ గ్రామానికి చెందిన గేడం వసంతరావు కుమారుడు గేడం భుజంగరావుకు బుధవారం విద్యుత్ షాక్ తగలడంతో గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం ఉదయం ఇంటి సమీపంలో ఆడుకుంటుండగా సమీపంలో ఉన్న ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపోకుండా కట్టిన తీగను పట్టుకోవడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వసంతరావు గమనించి గట్టిగా లాగడంతో ప్రమాదం తప్పింది. చేతి బొటనవేలు వద్ద పూర్తిగా కాలిపోవడంతో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం ఉట్నూర్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. వైద్యులు పరీక్షించి ప్రాణపాయం తప్పిందన్నారు.

నీట్‌లో జిల్లా విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

ఆదిలాబాద్‌టౌన్: మెడికల్ కళాశాలల్లో ప్రవేశం కోసం నిర్వహించిన నీట్ పరీక్షలో జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఎస్ఆర్ కళాశాలకు చెందిన విద్యార్థులు వై.అశ్విన్ రెడ్డి 720 మార్కులకు గానూ 580, రాథోడ్ 527, ఆదిత్య 493, అనీష్ 482, అను 421, అన్విక 418, సాత్విక 405 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల జోనల్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు కె.బ్రహ్మం, జైపాల్ రెడ్డి, అరవింద్, లెక్చరర్లు అభినందించారు.

సత్తాచాటిన సమృద్ధి


సమృద్ధి

తాంసి: భీంపూర్ మండలంలోని అర్లి(టి) గ్రామానికి చెందిన రాథోడ్ ఉల్లాస్, హారతి దంపతుల కుమార్తె రాథోడ్ సమృద్ధి నీట్ ఫలితాల్లో 620 మార్కులు సాధించి సత్తా చాటింది.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

నేరడిగొండ: మండలంలోని దూద్‌గండి జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు (30) మృతి చెందినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అతను అక్కడికక్కడే మృతిచెందగా మృతదేహం గుర్తు పట్టని విధంగా మారింది. ఆనవాళ్లను బట్టి నేపాల్‌కు చెందిన వ్యక్తిగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. ఎత్తు 4.5 ఫీట్లు ఉందని, బ్లూ కలర్ జీన్స్ పాయింట్, తెలుపు రంగు టీషర్ట్ ధరించి ఉన్నాడు. వివరాలు తెలిసిన వారు 8712659947 నంబరులో సంప్రదించాలని ఎస్సై సూచించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

ఖానాపూర్: మండలంలోని ఎక్బాల్‌పూర్‌లో నిర్మల్–ఖానాపూర్ ప్రధాన రహదారిపై ద్విచక్రవాహనంపై నుంచి పడి మహిళకు గాయాలయ్యాయి. కడెం మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన వేదిక–వెంకటి దంపతులు బైక్‌పై నిర్మల్ నుంచి ఖానాపూర్ వస్తుండగా మహిళ అకస్మాత్తుగా కళ్లు తిరిగి రోడ్డుపై పడిపోయింది. 108కు సమాచారం ఇవ్వడంతో నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఇంటర్ ప్రవేశాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

నార్నూర్: పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో ప్రవేశం పొందాలని అధ్యాపకులు చదల నరేశ్, ఉదయ్‌కుమార్ అన్నారు. బుధవారం పొలంబాట పట్టి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. ఉచిత పుస్తకాలు, స్కాలర్‌షిప్‌లు, అనుభవం కలిగిన అధ్యాపకులచే విద్యా బోధన జరుగుతోందని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

లింగాపూర్: బావిలో దూకి వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పిక్లాతండాలో చోటు చేసుకుంది. ఎస్సై కొట్టే ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన బోడా దేవులిబాయి (59) కొంతకాలంగా మద్యం సేవించి ఇరుగు పొరుగు వారితో గొడవ పడుతుండేది. ఆమె కుమారుడు బోడా శంకర్ మందలించడంతో మనస్తాపానికి గురైంది. బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అనారోగ్యంతో వృద్ధుడు..

మంచిర్యాలరూరల్(హాజీపూర్): అనారోగ్య సమస్యలతో వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన హాజీపూర్ మండలం పెద్దంపేటలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై గోపతి సురేష్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బెంబడి బక్కయ్య(70) కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. గుర్తు తెలియని పురుగుల మందు తాగడంతో గమనించిన కుటుంబ సభ్యులు మంచిర్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య పోసు, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు రాజలింగు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్‌లోనూ బీజేపీదే ఆధిపత్యం

- ఎంపీ నగేశ్‌కు అత్యధికంగా 9232 ఓట్లు
- 5,183 ఓట్లతో రెండో స్థానంలో ఆత్రం సుగుణ

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ఓట్లలోనే బీజేపీ తన ఆధిక్యతను చాటుకుంది. ఆ పార్టీ తరపున ఎంపీగా గెలుపొందిన గోడం నగేశ్ ఈవీఎం ఓట్లలో భారీ మెజార్టీని సాధించగా పోస్టల్ బ్యాలెట్‌లోనూ ఇతర అభ్యర్థుల కంటే ఆధిక్యతను కనబర్చారు. ఈ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ వంటి ప్రధాన పార్టీలతో కలిపి మొత్తం 12 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 15,503 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి. ఇందులో 112 ఓట్లు నోటాకు పోగా మరో 841 ఓట్లు తిరస్కరణకు గురయ్యాయి. మిగతా ఓట్లలో అత్యధికంగా బీజేపీ అభ్యర్థి గోడం నగేష్ 9232 ఓట్లను సాధించి అగ్రస్థానంలో నిలిచారు. కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ 5,183 ఓట్లతో రెండో స్థానంలో నిలువగా బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కుకు కేవలం 837 ఓట్లు మాత్రమే రావడంతో మూడో స్థానానికి పరిమితం కావాల్సి వచ్చింది. గతేడాది అసెంబ్లీ ఎన్నికల వరకు రాష్ట్రంలో తిరుగులేని శక్తిగా ఉన్న బీఆర్ఎస్ ప్రజల్లోనే కాకుండా ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల్లోనూ ఆదరణను కోల్పోయిందనేందుకు ఆపార్టీకి వచ్చిన ఓట్లే నిదర్శనంగా నిలుస్తున్నాయి. మిగతా అభ్యర్థుల వారీగా పరిశీలిస్తే... బీఎస్పీ అభ్యర్థి మేస్రం జంగుబాపుకు 55, గొండ్వాన దండకారణ్య పార్టీ అభ్యర్థి కొడప వామన్‌రావుకు 8, ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థి మేస్రం గంగాదేవికి 23, ఇండియా ప్రజాబంధు పార్టీ తరపున పోటీ చేసిన గేడం సాగర్‌కు 8, అన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చౌవాన్ సుదర్శన్ 26, విద్యార్థుల రాజకీయ పార్టీ అభ్యర్థి ఎస్.తిరుపతికి 8 , అలయన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫాంస్ అభ్యర్థి మాలోత్ శ్యాంలాల్ నాయక్‌కు 10 ఇండిపెండెంట్ అభ్యర్థులైన బుక్యా జైవంత్ రావు 19 ఓట్లు, రాథోడ్ సుభాష్‌కు 94 ఓట్లు పోలయ్యాయి.

కార్మికుల సంక్షేమమే 'ప్రవాసీమిత్ర' లక్ష్యం


మాట్లాడుతున్న స్వదేశ్ పరికిపండ్ల

నిర్మల్‌ఖిల్లా: అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమమే తమ సంఘం ప్రధాన లక్ష్యమని ప్రవాసిమిత్ర కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్ల అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని శివాజీ చౌక్ సమీపంలో మార్బుల్ టైల్స్, గ్రానైట్ కార్మికుల సంఘం నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, బిహార్, ఛత్తీస్‌ఘడ్, తదితర రాష్ట్రాల నుంచి వచ్చి కష్టతరమైన పనులు చేస్తున్నారన్నారు. వీరంతా కలిసి ఒక సంఘంగా ఏర్పడి డిమాండ్ల సాధన కోసం సంఘటితం కావాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన భవన నిర్మాణ రంగ సంక్షేమ పథకాల కోసం ఈ–శ్రమ్ నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం సమన్వయకర్త కొమ్ము గీత, సభ్యులు డేవిడ్, స్వామి ట్రేడ్ యూనియన్ కార్యవర్గ సభ్యులు అజయ్, అఫ్రోజ్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరుచోట్ల భారీగా గుట్కా పట్టివేత

ఆదిలాబాద్‌టౌన్: తమకు అందిన సమాచారం మేరకు పట్టణ పోలీసులు బుధవారం స్థానిక గుండవార్ జిన్నింగ్ మిల్లు గోదాంపై దాడి చేసి రూ.4 లక్షల 44 వేల విలువైన గుట్కా తంబాకు పట్టుకున్నట్లు సీఐ అశోక్ తెలిపారు. పట్టణానికి చెందిన షేక్ రిజ్వాన్ అనే గుట్కా వ్యాపారి గుండవార్ జిన్నింగ్ మిల్లును అద్దెకు తీసుకుని అందులో గుట్కా తంబాకు దందా నడిపిస్తున్నాడు. మహారాష్ట్ర నుంచి కుల్ల గుట్కా తంబాకు తీసుకువచ్చి మాజాటిన్ డబ్బాల్లో ఒరిజినల్ లాగా ప్యాకింగ్ చేసి విక్రయానికి పాల్పడుతున్నాడు. దాడిలో భాగంగా గుట్కా తంబాకుతో పాటు ప్యాకింగ్ మిషన్, 240 వరకు ఖాళీ టిన్ డబ్బాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. యజమాని రిజ్వాన్ పరారీలో ఉండగా వర్కర్ అబ్దుల్ ఇర్ఫాన్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. ఈ దాడిలో కానిస్టేబుళ్లు నరేశ్, రమేశ్, క్రాంతి, పాల్గొన్నారు.

తాంసి బస్టాండ్‌లో..

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని తాంసి బస్టాండ్ ప్రాంతంలో గల జేపీ ట్రేడర్స్ యజమాని ఇజాజ్ అహ్మద్ అక్రమంగా నిల్వఉంచిన అంబర్, నిషేధిత గుట్కా, పొగాకు ఉత్పత్తులను టూటౌన్ పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. తమకు అందిన సమాచారం మేరకు షాపులో దాడులు నిర్వహించగా రూ.11వేల విలువ గల పొగాకు ఉత్పత్తులు లభించినట్లు టూటౌన్ సీఐ అశోక్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ఉట్నూర్‌లో రూ.1,87,200 విలువైన గుట్కా ..

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలో బుధవారం నిషేధిత గుట్కాను పట్టుకున్నట్లు ఎస్సై మనోహర్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు వాహనాల తనిఖీ చేపడుతుండగా ఉట్నూర్‌కు చెందిన వ్యాపారి వద్ద రూ. 1,87,200 విలువ గల గుట్కాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిషేధిత గుట్కా విక్రయాలు జరిపితే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

రూ.3.72 లక్షల విలువైన గుట్కా..

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని రాంపూర్ సమీపంలో బుధవారం నిషేధిత గుట్కా పట్టుకున్నట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణం నుంచి వాహనంలో తరలిస్తుండగా తమకు అందిన సమాచారం మేరకు రాంపూర్ సమీపంలో దాడులు నిర్వహించి రూ.3.72 లక్షల విలువ చేసే నిషేధిత గుట్కాను పట్టుకున్నట్లు తెలిపారు. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన మహ్మద్ అక్రమ్, సయ్యద్ అల్లాబాకస్‌లను అదుపులోకి తీసుకున్నారు. గుట్కా, వాహనం స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గత నెల 24న పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించిన హాజీపూర్ మండలం గుడిపేట గ్రామానికి చెందిన కారుకూరి రాజమణి (53) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్సై గోపతి సురేశ్ తెలిపారు. గుడిపేటకు చెందిన రాజమణి కొంతకాలంగా అనారోగ్యంతో పాటు ఇంటి సమస్యలతో బాధపడుతోంది. దీంతో మనస్తాపం చెంది గుర్తు తెలియని పురుగుల మందు తాగడంతో గమనించిన కుటుంబ సభ్యులు మంచిర్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి, అక్కడి నుంచి కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందింది. మృతురాలికి భర్త సత్తయ్య, కుమారులు అంజనేప్రసాద్, ప్రశాంత్ ఉన్నారు. కుమారుడు అంజనేయప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


మొక్క నాటుతున్న అజయ్‌కుమార్

నిర్మల్ రూరల్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆర్. అజయ్‌కుమార్ సూచించారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని కొండాపూర్ బాలసదనం, అంగన్‌వాడీ కేంద్రాల్లో మొక్కలు నాటారు. ఆయన మాట్లాడు తూ ఓజోన్ పొర పరిరక్షణకు పచ్చని చెట్లు పెంచాలని సూచించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారి నాగమణి, ఏసీడీపీవో నాగలక్ష్మి, సూపర్‌వైజర్ మంగళ, బాలసదనం ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ఎం.కవిత, సుమలత, మధుసూదన్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి దేవి మురళి, న్యాయవాదులు రాజలింగం, లింగాగౌడ్, నరేందర్, జిల్లా బాలల పరిరక్షణ సిబ్బంది ఎస్.రాజు, శ్రీనివాస్, నరేందర్, లక్ష్మణ్, మమత, శైలజ, కరుణశ్రీ పాల్గొన్నారు.

ఆర్మీ జవానుకు కన్నీటి వీడ్కోలు


అంతిమయాత్రలో పాల్గొన్న ప్రజలు

సిరికొండ: ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మండల కేంద్రానికి చెందిన ఆర్మీ జవాన్ సూర్యవంశి రాజేందర్(32)కు బుధవారం కుటుంబ సభ్యులు, గ్రామస్తుల అశ్రునయనాల మధ్య కన్నీటి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పొన్న ఎక్స్‌రోడ్డు నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆర్మీ అధికారులు సైనిక వందనం చేశారు. జాతీయ పతాకాన్ని భౌతిక కాయంపై ఉంచి నివాళులు అర్పించారు. ఆర్మీజవాన్ ఆఖరి చూపు కోసం జనం భారీగా తరలివచ్చారు.

చిరుతపులి దాడిలో చుక్కలదుప్పి హతం


దుప్పి కళేబరం

రామకృష్ణాపూర్: బొక్కలగుట్ట గాంధారిఖిల్లాలో చిరుతపులి దాడిలో చు క్కల దుప్పి హతమైన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. ఖిల్లా దిగువ భాగానికి వెళ్లిన ఉ పాధిహామీ కూ లీలు దుప్పి కళేబరాన్ని గుర్తించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించగా వేసవి దృష్ట్యా దాహం కోసం వచ్చిన దుప్పిపై చిరుతపులి దాడి చేయడంతో మృతి చెందినట్లు నిర్ధారించారు.

భయాందోళనలో గ్రామస్తులు

చిరుతపులి సంచారం, దుప్పి మృతి ఘటన గాంధారి ఖిల్లా పరిసర ప్రాంతాల్లో అలజడి రేపుతోంది. కొన్ని నెలల క్రితం చిరుతపులి సంచరిస్తున్న విషయం బయటకు రావటం ఇప్పుడు దుప్పి కళేబరం వెలుగులోకి రావడంతో సహజంగానే ఆందోళన మొదలైంది. గాంధారి ఖిల్లా పరిసర గ్రామాలైన బొక్కలగుట్ట, పులిమడుగు ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. కాగా ఈ దాడి ఘటన మంచిర్యాల జిల్లాలో సంచలనం రేపింది.